ప్రజాశక్తి

ఆదివారం 21 డిసెంబర్ 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ఇండస్ట్రియల్ హబ్‌గా అనకాపల్లి

- ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై దృష్టి
- చెత్త రహిత రాష్ట్రమే ధ్యేయం
- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లాను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, రాంబిల్లి, పూడి, నక్కపల్లి, మాకవరపాలెం, వల్లూరుల్లో 24,843 ఎకరాలను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కొవ్వూరు, పరవాడ, అచ్చుతాపురంల్లో ఎంఎస్ఎంఇ పార్కులు తీసుకొచ్చామని, నక్కపల్లిలో 93 ఎకరాల్లో తొలి ప్రైవేట్ పార్కు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చెత్త లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజా వేదిక నుంచి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దేశం మొత్తానికి స్ఫూర్తినిచ్చేలా స్వచ్ఛభారత్ కార్యక్రమం నడుస్తోందన్నారు. అయితే ఇది ప్రభుత్వ కార్యక్రమంలా కాక ప్రజల భాగస్వామ్యంతోనే మరింత విజయవంత మవుతుందని తెలిపారు. పరిశ్రమల గురించి చెబుతూ.. రూ.2.89 లక్షల కోట్లు ఒక్క అనకాపల్లి జిల్లాలోనే వచ్చాయని, 1.57 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. అరకు కాఫీ ఒకప్పుడు ఎవరికీ తెలీదని, ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ కాఫీగా తయారైందని చెప్పారు. దేశంలోనే రెండో అతిపెద్ద బెల్లం మార్కెట్ అనకాపల్లిలో ఉందని, ఆర్గానిక్ బెల్లం తయారు చేస్తే ప్రపంచానికి ఎగుమతి చేయవచ్చని అన్నారు. ఆ బాధ్యతను ఎమ్మెల్యేలు, కలెక్టర్ తీసుకోవాలని కోరారు. గోదావరిని, వంశధారకు అనుసంధానం చేస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి పూర్వోదయం కింద ఉత్తరాంధ్రకు నిధులివ్వాలని కోరినట్టు తెలిపారు. ఇటీవల విశాఖ పెట్టుబడుల సదస్సు విజయవంతం అయిందని, రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడుల వచ్చాయని, 610 ఎంఒయులు చేసుకున్నామని, 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో తాము మిగతా 2లో..

నేటి నుంచి భారత్ - శ్రీలంక టి20

ముమ్మర సాధనలో మహిళా క్రికెటర్లు



సాధనలో భారత మహిళా క్రీడాకారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సాగరతీర నగరం విశాఖపట్నం మరో అంతర్జాతీయ క్రికెట్ పోరుకు సిద్ధమైంది. ఇటీవల వన్డే ప్రపంచకప్‌ను సాధించి ఫుల్ జోష్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో శ్రీలంకతో తలపడేందుకు సమాయత్తమైంది. ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 7 గంటలకు మొదటి టి20 మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌లు విశాఖపట్నంలో జరగనున్నాయి. శనివారం ఇరుజట్లూ మైదానంలో ముమ్మర సాధనలో నిమగ్నమయ్యాయి.

బలాబలాలు ఇలా..

హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. మిడిల్ ఆర్డర్‌లో జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ అండగా ఉన్నారు. ఈ సిరీస్ ద్వారా యువ క్రీడాకారిణులు జి.కమలిని, లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ అరంగేట్రం చేసే అవకాశం ఉంది. బౌలింగ్‌లో రేణుకా సింగ్ ఠాకూర్, స్నేహ రాణా భారత్‌కు ప్రధాన బలం.

కెప్టెన్ చమరి ఆటపట్టు మీద శ్రీలంక జట్టు ఎక్కువగా ఆధారపడి ఉంది. హర్షిత సమరవిక్రమ, కవిషా దిల్హారి వంటి ఆటగాళ్లతో శ్రీలంక జట్టు భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. అయితే, భారత గడ్డపై టీమిండియాను ఎదుర్కోవడం వారికి సవాలే అని చెప్పాలి.

హెడ్-టు-హెడ్ రికార్డులు

మొత్తం టి20ల్లో ఇప్పటివరకు భారత్, శ్రీలంక 33 సార్లు తలపడగా.. భారత్ 23 మ్యాచుల్లో విజయం సాధించింది, శ్రీలంక 9 మ్యాచుల్లో గెలిచింది. ఒకటి ఫలితం తేలలేదు. వాతావరణ పరిస్థితుల ప్రకారం ఆదివారం విశాఖలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. వర్ష సూచన లేదు. విశాఖ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. రెండో ఇన్నింగ్స్‌లో మంచు కురిసే అవకాశం ఉన్నందున టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

గణిత పునాదులపైనే సాంకేతిక అభివృద్ధి

వార్త 5లో..

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

వార్త 2లో..

భోగాపురం ఎయిర్ పోర్టుతో బిఎస్ఎన్ఎల్ ఒప్పందం

వార్త 2లో..

'ఉపాధి'ని చంపేసిన మోడీ సర్కారు

ఎఐసిసి అధికార ప్రతినిధి గురుదీప్ సింగ్ సప్పల్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రామీణ పేదలకు ఎంతో మేలు చేసిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చంపి వేసిందని ఎఐసిసి అధికార ప్రతినిధి గురుదీప్ సింగ్ సప్పల్ విమర్శించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సంస్కరణ పేరుతో లోక్‌సభలో మరో బిల్లును బుల్‌డోజర్ చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి హామీ చట్టాన్ని హత్య చేసిందన్నారు.

మహాత్మా గాంధీ తత్వాన్ని కూల్చివేసి, పేద భారతీయుల నుంచి పని హక్కులను లాక్కోవడానికి చేసిన ఉద్దేశపూర్వక ప్రయత్నంగా ఆయన పేర్కొన్నారు. 2014 నుంచి ప్రధానమంత్రి మోడీ ఉపాధి హామీ చట్టం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారన్నారు.

'కూటమిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 18 నెలల్లోనే ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని, తీవ్ర అసంతృప్తిని మూటగట్టుకుందని వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. శనివారం విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే అంగీకరించారని ఎద్దేవా చేశారు. విశాఖలో ఐటి ముసుగులో భూదోపిడీ జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం అమరావతిపైనే తాపత్రయపడుతూ విశాఖ వంటి ప్రాంతాలను మిగతా 2లో..

కాలుష్య నియంత్రణకు చర్యలు

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖను కాలుష్య రహిత నగరంగా చేయటానికి అన్ని చర్యలూ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. క్షీణిస్తున్న వాయు నాణ్యతపై అత్యవసర చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నగరంలో కాలుష్యం ఎక్కువగా ఉందని మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించడానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి క్వాలిటీ మానిటరింగ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ నియమిస్తున్నామన్నారు. చెత్తను, వ్యర్థాలను తొలగించే వాహనాలను పూర్తిగా టార్పాలిన్‌తో కప్పాలని, పరిమితికి మించి వాహనాలలో చెత్త తరలించరాదని జివిఎంసి అధికారులకు సూచించారు. చెత్తను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో తడి చెత్తను, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. భవన నిర్మాణాలు చేపట్టేటప్పుడు నిర్మాణం చుట్టూ గ్రీన్ పరదాలు కప్పాలన్నారు. తొలగించిన భవన శిథిలాలను ఎక్కడపడితే అక్కడ పోయివద్దని సూచించారు. రాత్రి సమయాల్లో అలాంటి వాహనాలపై నిఘా పెట్టాలని, ఆ వాహనాలను సీజ్ చేసి సంబంధిత భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యర్థాలను తొలగించేటప్పుడు గ్రామ, వార్డు సచివాలయ సెక్రటరీలకు తెలియజేయాలన్నారు. పరిశ్రమల నుండి పొల్యూషన్ రాకుండా ముడి పదార్థాలను సక్రమంగా ఉంచుతున్నారో లేదో పొల్యూషన్ కంట్రోల్, పరిశ్రమల, ఫ్యాక్టరీల అధికారులు ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. సిగ్నల్స్ అన్నీ సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని, ఎక్కువ సమయం సిగ్నల్స్ పడితే ఇంజిన్ ఆఫ్ చేయాలని, బస్టాప్‌ల వద్ద వాహనాలు ఎక్కువసేపు ఇంజిన్ ఆన్ చేసి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఇండస్ట్రియల్ హబ్‌గా అనకాపల్లి

యజ్ఞం చేస్తూ ముందుకు వెళ్తుంటే రాక్షసులు వివిధ రూపాల్లో అడ్డం వస్తున్నారని, ఐటి కంపెనీలు రాకుండా కేసులు వేస్తున్నారని, మెగా డిఎస్‌సికి కేసులు వేశారని మండిపడ్డారు. కానిస్టేబుల్ ఉద్యోగాలపైనా కేసులు వేశారని, వారికి ఒకటే చెప్తున్నామని భూ బకాసురులు ఎంతమంది ఎన్ని అడ్డంకులు సృష్టించినా అనుకున్న పని వదలనని చంద్రబాబు అన్నారు. విశాఖను గత పాలకులు గంజాయికి రాజధాని చేస్తే తాము ఎఐ, డేటా సెంటర్, యోగా రాజధానిగా చేస్తున్నామని అన్నారు. నేడు తమ ప్రభుత్వంలో దందాలు, కబ్జాలు లేవన్నారు. రుషికొండను గుండు కొట్టించి రూ.500 కోట్లతో నాడు ప్యాలెస్ కట్టుకున్నారన్నారు. అదే సమయంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా కట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. సర్వే రాళ్ల కోసం రూ.700 కోట్లు ఖర్చు చేశారని, ఇంటికి ఇనుప కాంపౌండ్ కోసం రూ.15 కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం, ప్రజల ఆరోగ్యం కోసమే ఖర్చు చేస్తోందని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం గంజాయి వనంగా మార్చిన ప్రాంతాన్ని నేడు కాఫీ వనం ప్రాంతంగా తాము మార్చామన్నారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, నారాయణ, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎంపీ సిఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో సిఎం

తాళ్లపాలెంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని సిఎం చంద్రబాబు ప్రారంభించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించే విధానాలను తెలుసుకున్నారు. అలాగే పారిశుధ్య కార్మికులతో కలిసి సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించారు. స్వచ్ఛ రథాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.68.25 కోట్లతో తలపెట్టిన ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు, ఫీకల్ స్లెడ్జ్ శుద్ధి ప్లాంట్లు, గోబర్ దన్ ప్లాంట్లు, గ్రే వాటర్ నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు

ఉంచినట్లయితే రవాణా, పోలీస్ శాఖ అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత వాహనాలకు పొల్యూషన్ చెక్ చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ చర్యలపై ప్రతిరోజూ నివేదిక ఇవ్వాలని కోరారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ముకుందరావు, జివిఎంసి అడిషనల్ కమిషనర్ రమణమూర్తి, ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, డిఎస్ఒ భాస్కరరావు, పోర్ట్ అధికారులు, పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

'కూటమిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి'

దోచుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వారే దోపిడీకి పాల్పడుతుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని, త్వరలోనే తిరుగుబాటు ఖాయమని హెచ్చరించారు. అవినీతికి పాల్పడుతున్న వారందరినీ చట్టం ముందు నిలబెట్టే రోజు వస్తుందని అన్నారు.

మహిళలకు రక్షణ ఏదీ ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రాన్ని 'సన్‌రైజ్ స్టేట్'గా మారుస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాస్తవానికి ఆంధ్రప్రదేశ్‌ను 'క్రైమ్ రైజింగ్ స్టేట్'గా మార్చేసిందని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం మద్దిలిపాలెంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ (ప్రాంత అభివృద్ధి సంస్థ) పరిధిలోని పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, ఆదాయ వనరులను పెంచేలా అధికారులు కృషి చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. శనివారం ఆయన వీఎంఆర్‌డీఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు మ్యూజియంలను క్షేత్రస్థాయిలో పర్యటించి, అక్కడి వసతులను, నిర్వహణను పరిశీలించారు. ప్రధానంగా బీచ్ రోడ్డులోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన సబ్‌మెరైన్ మ్యూజియం, టియు-142 యుద్ధవిమాన మ్యూజియం, సీ హ్యారియర్ మ్యూజియం , యుహెచ్3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియంలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మ్యూజియంల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారు లను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, కార్యదర్శి మురళీకృష్ణ, కార్యనిర్వాహక ఇంజనీర్లు సింగ్, రామరాజు, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణమూర్తి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యంతో మెరుగైన అవకాశాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: నైపుణ్యం కలిగిన యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాన్సెంట్రిక్స్ సంస్థ హెచ్ఆర్ మేనేజర్ శైలేష్ అన్నారు. విశాఖ నగరంలో తొలిసారిగా ట్రై బి ఇన్‌సి నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన నో రెజ్యూమ్ -వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఉద్యోగాలు ఎంపిక కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. విశాఖ నగరంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏకైక లక్ష్యంతో ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా ఉచితంగా నిర్వహించిన ఈ జాబ్‌మేళా విజయవంతమైంది. సిరిపురంలోని ఉడాచిల్డ్రన్ ఏరీనా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ జాబ్‌మేళాలో సుమారు 5000 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు చెందిన 60కి పైగా సంస్థలు ఉద్యోగ నియామకాలు నిర్వహించారు.

సంస్థ నిర్వాహకులు వంశీకృష్ణ, శివ మాట్లాడుతూ విశాఖలో నైపుణ్యాలు కలిగిన యువతను ఉపాధి కల్పించే సంస్థలతో తమ సంస్థ తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందని చెప్పారు. జాబ్‌మేళాలో 500 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సేల్స్ మార్కెటింగ్, ఐటి, బిపిఓ వంటి సంస్థలు పాల్గొన్నాయి.

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని పార్క్ హోటల్ సర్కిల్ వద్ద భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి కలలను ప్రధాని మోడీ నెరవేరుస్తున్నారని అన్నారు. ఎపిలో డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. త్వరలోనే తెలంగాణలో కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలించి బిజెపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విశాఖ అభివృద్ధి చెందితే దేశమంతా ఆ ఫలాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్, జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ నివాళులర్పించారు. వాజ్‌పేయి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

భోగాపురం ఎయిర్ పోర్టుతో బిఎస్ఎన్ఎల్ ఒప్పందం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జివిఐఎఎల్ భోగాపురం విమానాశ్రయంలో పూర్తి స్థాయిలో టెలికాం సొల్యూషన్స్ ప్రొవజనింగ్ కార్యకలాపాల కోసం ఎయిర్ పోర్ట్ యాజమాన్యంతో బిఎస్ఎన్ఎల్ ప్రత్యేకమైన ఒప్పందం కుదుర్చుకుని శనివారం సంతకం చేసింది. భారతదేశంలో మొట్టమొదటిసారిగా పది సంవత్సరాలు పాటు గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని స్థాపించడానికి ఎండ్ టు ఎండ్ పరిష్కారాలతో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ నుండి ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ జి.ఆడమ్, శ్రీకాకుళం విజయనగరం జనరల్ మేనేజర్ ఎం. నాయుడు, విశాఖపట్నం డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఎంటర్ప్రైజ్ బిజినెస్) డాక్టర్ ఎం.సత్యప్రసాద్ విజయనగరం డిజిఎం డి.నాయుడు పాల్గొన్నారు. డాక్టర్ ఎం.సత్యప్రసాద్ బిఎస్ఎన్ఎల్ తరఫున ప్రజెంటేషన్ ఇచ్చారు. 5జి నెట్‌వర్క్ స్థాపన ప్రతిపాదన, తదితరాలపై సుదీర్ఘంగా చర్చించారు.

కోర్టు నోటీసు

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
O.S. 31/2019

Between: -
Baratam Vasudeva Rao
---Petitioner /Plaintiff.
And: -
Gode Kanatha Rao (died) and others
----Respondents/ Defendants.
To,
R-4: Korada Sobharani, W/o Narendra household duties, residing at Main Road Narshipatnam, Anakapalli District.

పై కోర్టులో వాది ప్రతివాది ఐన గొడే కాంతారావు పై పైన నెంబరు దావా దాఖలు చేయగా సదరు ప్రతివాది కాలం చేసినందున సదరు ప్రతివాది వారసురాలుగా నీవు 4వ ప్రతివాది అయినందున నీ యొక్క నోటీసు నిమిత్తం పై నెంబరు దావాను **తే 31-12-2025 దీ న పై కోర్ట్ వారు వాయిదా వేసినారు** కావున పై **తేది నాడు ఉదయం 10-30 గం॥** కు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయం గాని వకీలు ద్వార గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియపరుచుకొనవలెను.లేని యుడల మీ పరోక్షంగా తీర్మానించడమగునని ఇందుములముగ తెలియపరచడమైనది.

// శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ మేరకు. //
ఎన్.వి. శేషగిరి రావు
అడ్వకేట్,
శ్రీకాకుళం,సెల్: 9440069414.

IN THE COURT OF THE VI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 5758 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer,
...Plaintiff
A n d
Sri.G.Venkata Rao,
...Defendant
To
Sri.G.Venkata Rao, S/o. Atchanna.G, Aged about 45 Years, Occ: Business, R/o. D.No 269/7, Edulapaka Bonangi Paravada Desapa trunipalem,Visakhapatnam, A.P-531021.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.5,12,359-16ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 06-01-2026. In case of your failure to attend before the Court on **06-01-2026** at **10-30** A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T. Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE X JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 3181 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer,
...Plaintiff
A n d
Smt.P.Sarala Kalyan
...Defendant
To
Smt.P.Sarala Kalyan, W/o.P.S.Kalyan Chakravarthy, Aged about 50 Years, Occ: Business, R/o.Flat No. 301, D.No. 6-21-11/2, Skyline Vaibhavam Apts, East Point Colony, Vishakapatnam, A.P-530017.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs. 3,98,085-74ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 23-01-2026.

In case of your failure to attend before the Court on **23-01-2026** at **10-30** A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
M.Narender Reddy,
Advocate
Cell:9494828615.
Office:at H.No.2-3-703/14/2,
Tirumalanagar, Opp:MRO
Office Lane, Amberpet, Hyderabad.

IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 1320 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer,
...Plaintiff
A n d
Sri. Raghu Babu
...Defendant
To
Sri. Raghu Babu S/o. Kameswararao, Aged 52 years, Occ: Business, R/o. Flat No.206, yelamanchali Heights, Chandrampalem, Madhurawada, Vishaka patnam, Andhra pradesh-530045.

.Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,70,475-13 ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 09-01-2026. In case of your failure to attend before the Court on 09-01-2026 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

మహారాజశ్రీ 4వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కమ్ జూనియర్ సివిల్ జడ్జి రాజమండ్రి వారి కోర్టులో
O.S.No.240/2025

బిట్వీన్:-
తేతలి విజయభారతి ...వాది
మరియు
అరిసపు రాంబాబు మరియు ఇద్దరు ...**ప్రతివాదులు**

ఈ దావా గ్రంధములో అరిసపు రాంబాబు మరియు ఇద్దరు ప్రతివాదులు ఉన్నారు. ఈ దావాలో 3వ ప్రతివాది అయిన పల్లెల గంగమ్మకు గుట్టుముక్కాల రామరాజుగారు జనరల్ పవర్ ఆఫ్ అటార్నిగా వ్యవహరిస్తున్నారు.

3వ ప్రతివాది.
పల్లెల గంగమ్మ, భర్త (లేటు) వరహాలు, హిందువు, వయసు 72సం॥లు, గృహిణి, గోకవరం గ్రామం, గోకవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా.

ప్రతినిధిగా వ్యవహరిస్తున్నవారు.
గుట్టుముక్కాల రామరాజు, తండ్రి వెంకట నరసింహరాజు, హిందువు, వయస్సు 65సం॥లు,డోర్‌నెం.15-79, MIG2/44, పోతినమల్లయపాలెం గ్రామం, విశాఖపట్నం జిల్లా. అను మీరు పై దావా గ్రంధంలో 3వ ప్రతివాది అయి ఉన్నారు. శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం **ది.06-01-2026** సం॥రం తేదీన **గం॥10.30ని॥లకు** శ్రీ కోర్టువారి ఎదుట విచారణ నిమిత్తం హాజరు కావలెను. మీరు హాజరు కాని ఎడల 3వ ప్రతివాది అయిన మీ పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్పు చెప్పెదరు.

(శ్రీ కోర్టువారి అనుమతితో)
తవ్వల వీరేంద్రనాథ్
రాజమండ్రి వాది తరపు న్యాయవాది
20-12-2025 రాజమండ్రి

మహారాజశ్రీ 4వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కమ్ జూనియర్ సివిల్ జడ్జి రాజమండ్రి వారి కోర్టులో
O.S.No.256/2025

బిట్వీన్:-
తేతలి విజయభారతి ...వాది
మరియు
శ్రీమతి అరిసపు చక్రవాణి మరియు నలుగురు ...**ప్రతివాదులు**

పై నెంబరు గల దావా గ్రంధములో అరిసపు చక్రవాణి మరియు నలుగురు ప్రతివాదులు ఉన్నారు. ఈ దావాలో 5వ ప్రతివాది అయిన పల్లెల గంగమ్మకు గుట్టుముక్కాల రామరాజుగారు జనరల్ పవర్ ఆఫ్ అటార్నిగా వ్యవహరిస్తున్నారు.

5వ ప్రతివాది.
పల్లెల గంగమ్మ, భర్త (లేటు) వరహాలు, హిందువు, వయసు 72సం॥లు, గృహిణి, గోకవరం గ్రామం, గోకవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా.

ప్రతినిధిగా వ్యవహరిస్తున్నవారు.
గుట్టుముక్కాల రామరాజు, తండ్రి వెంకట నరసింహరాజు, హిందువు, వయస్సు 65సం॥లు,డోర్‌నెం.15-79, MIG2/44, పోతినమల్లయపాలెం గ్రామం, విశాఖపట్నం జిల్లా. అను మీరు పై దావా గ్రంధంలో 5వ ప్రతివాది అయి ఉన్నారు. శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం **ది.06-01-2026** సం॥రం తేదీన **గం॥10.30ని॥లకు** శ్రీ కోర్టువారి ఎదుట విచారణ నిమిత్తం హాజరు కావలెను. మీరు హాజరు కాని ఎడల 5వ ప్రతివాది అయిన మీ పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్పు చెప్పెదరు.

(శ్రీ కోర్టువారి అనుమతితో)
తవ్వల వీరేంద్రనాథ్
రాజమండ్రి వాది తరపు న్యాయవాది
20-12-2025 రాజమండ్రి

పోస్కో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : లైంగిక వేధింపుల నుంచి బాలలను సంరక్షించే పోస్కో చట్టంపై విశాఖ వ్యాలీ సమీపంలోని బాలికాసంరక్షణ కేంద్రంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, డైరక్టర్ డాక్టర్ సిహెచ్.లక్ష్మణరావు, గీతం న్యాయ సలహ కేంద్రం కో-ఆర్డి నేటర్ ఎన్.అప్పలరాజు హజరై పోస్కో చట్టం బాలలను లైంగింక వేధింపుల నుంచి ఎలా సంరక్షిస్తుందో వివరించారు. మంచి, చెడు స్పర్శ మధ్య తేడాను వివరించారు. పలు ఆత్మ రక్షణ విధానాలను గీతం న్యాయ సలహ కేంద్రం సభ్యులు తెలియజేశారు. అపరిచిత వ్యక్తులే కాక పరిచయమున్న వారైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికా సంరక్షణ పట్ల నిబద్ధతతో ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

విద్యుత్ పొదుపుపై బుర్రకథ

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో శనివారం విద్యుత్ పొదుపుపై బుర్రకథను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖాధికారి జగన్మోహన్ మాట్లాడుతూ, విద్యుత్తును పొదుపు చేసుకోవడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ నగేష్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

తెలగ సంఘం ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 1వ వార్డు పరిధిలో చిట్టివలసకు చెందిన గాజుల సింహాద్రి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు తెలగ సేవా సంఘం సభ్యులు రూ.17 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రంగూరి సీతారామదొర, సభ్యులు గిరిధర్, మేకల శ్రీనివాస్, మేకల రమేష్, తమ్మిన ప్రకాష్, జల్లు సంతోష్ పాల్గొన్నారు.

25న శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం వార్షికోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డులో ఉన్న శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 24వ వార్షికోత్సవాన్ని ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు డాక్టర్ పింగళి ఆనందకుమార్ తెలిపారు. పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీ షా పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా 'గాయత్రి' గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డిగ్రీలను ప్రదానం చేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-మధురవాడ : గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్) 13వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గాయత్రి కళాశాల రుషికొండ క్యాంపస్ సెంట్రల్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆచార్య కె.మధుమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్య విశిష్టమైన సంపద అన్నారు. శరవేగంతో పురోగతి సాగిస్తున్న ఆధునిక సాంకేతిక విజ్ఞానం, కృత్రిమ మేధస్సు, ఎఐ క్వాంటమ్ కంప్యూటర్‌లో మెలకువలను అందిపుచ్చుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధితో ఉన్నతంగా రాణించగలరని చెప్పారు. గాయత్రి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కెఎస్.బోస్ కళాశాల ప్రగతిని, విద్యాసంబంధ కార్యక్రమ వివరాలను వివరించారు. అనంతరం డిగ్రీ కోర్సుల నుంచి 80 మంది, పీజీ కోర్సుల నుంచి 318 మంది, ఇంజినీరింగ్ విద్య నుంచి 204 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. డిగ్రీ నుండి ఎనిమిది మందికి, ఎంబిఎ నుంచి ఒకరికి బంగారు పతకాలు అందజేశారు. ఎంబిఎ నుంచి ఆరుగురికి పిహెచ్‌డి డిగ్రీలను ప్రదానం చేశారు. జివిపి ఉపాధ్యక్షులు ఆచార్య డి.దక్షిణామూర్తి సభా అధ్యక్షత వహించిన కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ ప్రతినిధులు మూర్తి, ఆచార్య పి.సోమరాజు, డివిఎస్.కామేశ్వరరావు, ఆచార్య పరగడ రాజ గణపతి, ఆచార్య పివి.శర్మ తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కుల పంపిణీలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-మధురవాడ : వివిధ ఆరోగ్య సమస్యలతో సాయం కోసం దరఖాస్తు చేసుకున్న 21 మందికి ప్రభుత్వం విడుదల చేసిన రూ.15.06 లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఎంవిపి.కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో లబ్ధిదారులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అందజేశారు. అనారోగ్యం ఆధారంగా రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఏయే సమస్యలకు ఈ సాయం అందుతుందనేది గంటా శ్రీనివాసరావును బండి సంజయ్ అడిగి తెలుసుకున్నారు. ఆకస్మిక అనారోగ్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా ఆదుకుంటుందని గంటా తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ పివి.నరసింహం, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, జి.సుభాష్‌చంద్రబోస్, గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డుకు చెందిన పలువురు లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంవిపి.కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో గంటా శ్రీనివాసరావు అందజేశారు. బోయివీధికి చెందిన కాసరపు అచ్చియ్యమ్మకు రూ.1,07,000లు, కొక్కిరి జంపయ్యకు రూ.32 వేలు, అడిదం అంజనీ కుమార్‌కు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, గంటా నూకరాజు, కాసరపు నాగరాజు, ఎస్.జోగారావు, వి.సత్యారావు, సంజీవరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పోటీతత్వంతో పనిచేయాలి

ప్రజాశక్తి -పద్మనాభం : అధికారులు పోటీతత్వంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలందించగలమని మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి చెప్పారు. పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు కూరగయలను డిజె రైతు బజార్ ద్వారా ప్రతి ఇంటికీ అందించే పద్ధతిని త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అధికారులు సహకరించాలని కోరారు. మండలంలోని బంగారు కుటుంబాలు 3000 ఉన్నాయని, నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT : VISAKHAPATNAM
I.A.243/2021 in O.S. 539/2021

Between:
Smt. Polamarasetty Mahalakshmi & 3 others ...Petitioners/Plaintiffs
And
Sri Vadaboyina Kumar & 8 others ...Respondents/Defendants

NOTICE

To
R-8: Sri Yangalasetty Ganesh Babu, S/o. Lakshmi Narayana, Hindu, aged 49 years, R/at D.No. 43-5-17, Flat No.203, Sakar Residency, Railway New Colony, Visakhapatnam.

Please take notice that the above I.A.243/2021 in O.S. 539/2021 was filed against you & others for declarations and permanent injunction stands posted to **08-01-2026** for your notice. If you have any objection, you may attend either personally or through an Advocate before the above said Court at **10.30 A.M.**, on **08-01-2026**, failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Hon'ble Court)
P.A.K. KISHORE
Advocate, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT : VISAKHAPATNAM
O.S.539/2021

Between:
Smt. Polamarasetty Mahalakshmi & 3 others ...Plaintiffs
And
Sri Vadaboyina Kumar & 8 others ...Defendants

SUMMONS

To
D-8: Sri Yangalasetty Ganesh Babu, S/o.Lakshmi Narayana, Hindu, aged 49 years, R/at D.No. 43-5-17, Flat No.203, Sakar Residency, Railway New Colony, Visakhapatnam.

Please take notice that the above suit was filed against you & others for declarations and permanent injunction stands posted to **08-01-2026** for your notice. If you have any objection, you may attend either personally or through an Advocate before the above said Court at **10.30 A.M.**, on **08-01-2026**, failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Hon'ble Court)
P.A.K. KISHORE
Advocate, Visakhapatnam.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టచ్ స్టోన్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గీతం, గాయత్రీ వైద్య కళాశాలలు, ప్రభుత్వ వైద్యుల సహకారంతో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఆరోగ్య సూచనలు చేశారు. వెల్లంకి జిల్లా పరిషత్ హైస్కూల్, బొడ్డపాలెం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, గుట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాండ్రంకి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ శిబిరాలు నిర్వహించారు. టచ్ స్టోన్ చారిటీస్ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పంపిణీ చేస్తూ, విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడేందుకు స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సేవలు అందిస్తోంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కొమ్మాది : రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... భీమిలి పెద్దవీధికి చెందిన పూసర్ల లక్ష్మణరావు (79) మధురవాడ వల్లినగర్‌లోని తన బంధువుల ఇంటికి వచ్చారు. శనివారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ జంక్షన్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో వెళుతుండగా, వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పిఎం పాలెం సిఐ జి.బాలకృష్ణ ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీ బోల్తాతో రోడ్డుపై పడిన కెమికల్ పౌడర్ బస్తాలు

లారీ బోల్తా
రోడ్డుపై కెమికల్ పౌడర్ బస్తాలు

ప్రజాశక్తి -గాజువాక : షీలానగర్ గొడౌన్ నుండి గాజువాక ఆటోనగర్‌కు 150 టన్నులు బరువు ఉన్న కెమికల్ పౌడర్ బస్తాలను తీసుకెళ్తున్న ట్రయిలర్ లారీ ఆటోనగర్ జాతీయ రహదారి జంక్షన్ వద్ద యూటర్న్ చేస్తుండగా బోల్తా పడింది. ట్రయిలర్‌పై ఉన్న కెమికల్ పౌడర్ బస్తాలు రోడ్డు మీద పడిపోయాయి. రోడ్డుమీద బస్తాలు పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయభాస్కర్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- తగరపువలస : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ఆర్‌జెడి కె.విజయభాస్కర్ తెలిపారు. స్థానిక చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన పాఠశాల సముదాయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అనుసరించి బోధన జరపాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అదనపు సమయం కేటాయించి ఉత్తీర్ణులయ్యేలా చూడాలని చెప్పారు. విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా మాట్లాడుతూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ. వై.జగన్నాథ స్వామి, టి.శివజ్యోతి పాల్గొన్నారు.

గంటా జిష్ణు ఆర్యన్‌కు గిన్నిస్ బుక్‌లో చోటు

ప్రజాశక్తి-మధురవాడ : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మనవడు గంటా జిష్ణు ఆర్యన్ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. కేవలం 60 సెకన్ల వ్యవధిలో 216 దశాంశాల (డెసిమల్స్) స్వర్ణ నిష్పత్తి (గోల్డెన్ రేషియో)ను చెప్పడం ద్వారా హైదరాబాద్‌లో ఈ రికార్డు సృష్టించాడు. ఆర్యన్‌కు కోచ్‌గా అఖిల్ వ్యవహరించారు. 8 ఏళ్ల వయసులో ఈ రికార్డు సాధించాడు. ఆర్యన్ తండ్రి గంటా రవితేజ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు కాగా, తల్లి శరణి మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె. ఆర్యన్‌ను పలువురు అభినందించారు.



చిన్నయ్యసూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అతిథులు

ఘనంగా
పరవస్తు చిన్నయ్యసూరి జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : పరవస్తు పద్యపీఠం, తెలుగుదండు సంయుక్త నిర్వహణలో విశాఖ పౌరగ్రంథాలయంలో పరవస్తు చిన్నయసూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి ఉప్మాక దుర్గాప్రసాదరావు, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, డాక్టర్ కె.వరప్రసాదరెడ్డి, తానా పూర్వ అధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్, విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత డాక్టర్ సూరపనేని విజయకుమార్ హాజరయ్యారు. పరవస్తు చిన్నయసూరి వ్యాకరణ పురస్కారాన్ని గురు సహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాదుకు ముఖ్య అతిథుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత, ముఖ్య అతిథులు మాట్లాడుతూ, చిన్నయసూరి సాహితీ సేవను కొనియాడారు. బాల వ్యాకరణ వైభవాన్ని, నీతిచంద్రిక గొప్పతనాన్ని వివరించారు. తెలుగుదండు ఆధ్వర్యాన నిర్వహించిన టిట్టిభ సత్యాగ్రహం నిరసన దీక్షలో పాల్గొన్న కవులకు, కళాకారులకు, భాషాభిమానులకు వేదికపై చిరు సత్కారాలు అందజేశారు. శ్రీ హరిహర నృత్యనికేతన్ చిన్నారులు చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా గీతాలకు నృత్యం చేసి ప్రేక్షకులను అలరించారు. పరవస్తు పద్యపీఠం తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి సభాసమన్వయకునిగా వ్యవహరించారు.

తోపుడు బండ్ల వర్తకులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : గత 30 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్న బిసి రోడ్డు తోపుడు బండ్ల వర్తకులను ఆదుకోవాలని జివిఎంసి డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డికి, స్థానిక కార్పొరేటర్ పులి రమణారెడ్డికి స్టీల్ జోన్ సిఐటియు నాయకులు నమ్మి రమణ, పాల వెంకయ్య శనివారం వినతి పత్రం అందజేశారు. వీరిని చిల్లర వర్తకులుగా గుర్తించి గుర్తింపు కార్డులు అందజేశారని, ఆసీలు, జివిఎంసికి పన్నులు కడుతున్నారని తెలిపారు. 75 కుటుంబాలు జీవనోపాధి కోసం రోడ్డుమీద వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నాయని వివరించారు. తొలగించే ముందు వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని కోరారు. కోర్టు స్టే ఇచ్చినా జివిఎంసి ఏకపక్షంగా తొలగిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బంగారురాజు, పి.రాజు, సత్యనారాయణ, చిల్లర వ్యాపారస్తులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెవి.విశ్వనాథన్, భారత యువ క్రికెటర్ శ్రీచరణి, సిబిఐ జెడి వీరేష్ ప్రభు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రోటోకాల్ ప్రకారం ఘన స్వాగతం పలికారు. వారంతా ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సచివాలయ సిబ్బంది సమస్యలపై వినతి

ప్రజాశక్తి-వేపగుంట : సమస్యలపై జోన్ 8 పరిధిలోని సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీలు జోనల్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎడ్యుకేషనల్ సెక్రటరీ టెక్నికల్ వైపు ఉండేలా చూడాలని, ప్రమోషన్లు కల్పించాలని కోరారు.



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎడ్యుకేషన్ సెక్రటరీలు

ఘనంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి- యంత్రాంగం

పెందుర్తి : గోపాలపట్నంలోని అల్వర్‌దాస్ హైస్కూల్‌లో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కెవి.సతీష్ కుమార్ హాజరై మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని, క్రమశిక్షణ, సహనశక్తి, నాయకత్వ లక్షణాలను అందిస్తాయని తెలిపారు. కో-ఆర్డినేటర్ జివిఎస్ భగవాన్ మాట్లాడుతూ, 'క్రీడలు గెలుపోటములకే పరిమితం కావని, జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో పాఠాలు నేర్పిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని పేర్కొన్నారు.

పాఠశాల డైరెక్టర్ హర్షలత చిరంజీవి మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం విజేతలకు అతిథుల ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.హేమచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాజువాక : క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందని విజ్ఞాన్ హైస్కూల్ ప్రిన్సిపల్ కౌశిక్ పర్వీన్ అన్నారు. వార్షిక క్రీడా దినోత్సవంలో భాగంగా శనివారం గాజువాక హైస్కూల్ రోడ్డులోని విజ్ఞాన్ హైస్కూల్లో క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్ పర్వీన్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. దీనివల్ల క్రమశిక్షణ పెరుగుతుందని తెలిపారు. తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు కూడా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్, నిర్వహించారు. రన్నింగ్ రేసు, రిలే రేసులు, జంపింగ్, బాల్ గేమ్స్ తదితర క్రీడలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు.



విజ్ఞాన్ హైస్కూల్లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ఆత్మవిశ్వాసంతో చదివితే విజయాలు

ప్రజాశక్తి -గాజువాక : ఒత్తిడితో కాకుండా, ఆత్మవిశ్వాసంతో చదివితే విద్యార్థుల విజయాలు సాధిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ అన్నారు. గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జగ్గు జంక్షన్‌లో శనివారం ఏర్పాటుచేసిన ఈ సదస్సులో డిఇఒ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, కష్టపడి కాకుండా ఇష్టంతో, చక్కని ప్రణాళికతో చదివి మంచి మార్కులు సంపాదించి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో స్పష్టమైన, పెద్ద లక్ష్యాలు పెట్టుకొని, వాటి సాధనకు కృషిచేయాలని సూచించారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. పరీక్షలను ఒత్తిడితో కాకుండా ఆత్మవిశ్వాసంతో రాయాలని విద్యార్థులకు ప్రోత్సహించారు. తెల్లవారు జామున చదివిన విషయాలు బాగా జ్ఞాపకం ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అలెన్ కాలేజీ రెండు తెలుగు రాష్ట్రాల డీన్ నండూరి సీతారామ్, జిప్సా గౌరవాధ్యక్షుడు పి.భాస్కరరావు, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.షణ్ముఖరావు, కోశాధికారి ఎం.బాబూరావు, సభ్యులు రాము, సత్య, వాసుదేవరావు, మౌళి, మురళీ, సత్యనారాయణ, నాయుడు, సింహాచలం వివిధ పాఠశాల కరెస్పాండెంట్లు పాల్గొన్నారు.

మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పాలి

పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి -గాజువాక : సమాజాభివృద్ధి ద్వారా మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. గాజువాకలోని చైతన్య జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని బిసి రోడ్డులోని టిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించారు. మంత్రి రమాబాయి మెమోరియల్ పేరిట 2023-25 సంవత్సరాలకు గాను విద్యార్థినులు ఎమ్.లోచన, వై.స్వాతిలకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపి హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో ఆరోగ్యంపై కూడా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఆత్మరక్షణ కోసం ప్రతిఒక్కరూ యుద్ధ కళలపై ఆసక్తి చూపాలని కోరారు. మనం చేసే పనిద్వారా గుర్తింపు వస్తుందన్న విషయాన్ని అందరూ గ్రహించాలన్నారు. ప్రతిఒక్కరిలోనూ చైతన్యం వచ్చినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని చెప్పారు. ఏ మహిళకు కష్టం వచ్చినా పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తనకు నేరుగా ఫోన్ చేయవచ్చని చెప్పారు.

న్యాయ కళాశాల ప్రిన్సిపల్ కె.సీతామాణిక్యం మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ అవార్డులు కృషి పట్టుదలకు తార్కాణమని పేర్కొన్నారు. స్టీల్ సిటీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు కె.శకుంతల, కరస్పాండెంట్ జెఎస్ఆర్ఎస్ వర్మ, కార్యదర్శి మంత్రి శంకర్ నారాయణ, మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ రాధా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్‌ను కళాశాల యాజమాన్యం సత్కరించింది.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి పంచాయతీలో జనసేన నాయకులు వేములవలస పిఎసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు ఆధ్వర్యంలో కాలనీకి చెందిన వెన్ని అప్పలరాజు నాయకత్వంలో సుమారు 30 మందికి యువకులు జనసేన పార్టీలో చేరారు. భీమిలి జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల హాజరై యువకులకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వారికి జనసేన తగిన గుర్తింపునిస్తుందని తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ కాలనీలకు రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాల భవనం నిర్మాణం, నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి కారణంగా ఏర్పడుతున్న సమస్యలను సందీప్ దృష్టికి రౌతు నాగరాజు తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సందీప్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్‌తో పాటు రౌతు నాగరాజును గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి, జనసేన నాయకులు శ్రీనుబాబు, కృష్ణయ్య, మజ్జి శ్రీను, తమ్మిన అప్పలరాజు, మూర్తి, బాలు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ ఆఫీసర్ అప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-వేపగుంట : జోన్ 8 రెవెన్యూ ఆఫీసర్‌గా అప్పలనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జోన్ పరిధిలో సుమారు 92 వేల ఇంటి పన్నులు, వ్యాపార పన్నులు రూ.29 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.18 కోట్లు వసూలు అయ్యాయని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత వసూళ్లు చేపడతామని పేర్కొన్నారు

'గిరీష్' విద్యార్థుల విజ్ఞానయాత్ర

ప్రజాశక్తి- విశాఖపట్నం : కంచరపాలెంలోని గిరీష్ శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శనివారం విజ్ఞానయాత్ర చేపట్టారు. మధురవాడలోని శిల్పారామం, భీమిలి బీచ్, జూపార్క్, తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ అనురాధ మాట్లాడుతూ, మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థులు విజ్ఞాన యాత్రలో పాల్గొన్నారని తెలిపారు. పిల్లలు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో ముందుంటే మానసిక ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. ఆటలు, పాటలు, క్విజ్ తదితర పోటీలను పిల్లలకు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిల్పారామం జాతర వద్ద విద్యార్థులు

పరిశుభ్రత పట్ల అవగాహన పెంచేలా 'ముస్తాబు'

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



విద్యార్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన పెంచేలా ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా కసింకోట మండలం తాళ్లపాలెం సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులతో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు మాటామంతీ నిర్వహించారు. ముందుగా రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముస్తాబు కార్నర్‌ను చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ముస్తాబు కార్యక్రమం డిసెంబర్ 20 నుంచే అమలుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైతం దీనిని అమలు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, మంచి అలవాట్లు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంచేలా ముస్తాబు కార్యక్రమం రూపకల్పన చేసినట్టు పేర్కొన్నారు.

చెత్త నుండి సంపద వృద్ధి

చెత్త నుంచి సంపద వృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తాళ్లపాలెం గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించారు. చెత్త సేకరణపై పారిశుధ్య కార్మికులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంపోస్ట్ తయారీ యార్డ్ సందర్శించారు. చెత్తను కాంపోస్ట్‌గా తయారీ చేసి రైతులకు ఎరువులను అందిస్తున్న కంపోస్ట్ యూనిట్ నిర్వాహకుడితో మాట్లాడారు. ముఖ్యమంత్రి వెంట కలెక్టర్ విజయకృష్ణన్ ఉన్నారు.

స్వచ్ఛ రథాలు ప్రారంభం

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్తగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ రథాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 అభివృద్ధి పనుల్లో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు, ఫీకల్ స్లెడ్జ్ శుద్ధి ప్లాంట్లు, గోబర్ దన్ ప్లాంట్లు, గ్రే వాటర్ నిర్వహణ నిర్మాణాలు రూ.68.25 కోట్లతో చేపట్టిన పనులకు ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం, వీడ్కోలు


అనకాపల్లి జిల్లా కసింకోట మండలం తాళ్లపాలెంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగురు నారాయణ, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సిఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా పిఎస్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, రాష్ట్ర స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అభివద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్, ఉమ్మడి విశాఖ జిల్లాల డిసిఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, టీచర్స్ ఎమ్మెల్సీ, పలువురు ఎమ్మెల్యే, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమాల అనంతరం చంద్రబాబు నాయుడుకు తిరుగు ప్రయాణంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కశింకోట మండలం తాళ్లపాలెంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం రోడ్డు మార్గాన చంద్రబాబు నాయుడు ఉగ్గినపాలెం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రయివేట్ లే అవుట్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుని విజయవాడకు తిరుగు పయనమయ్యారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర హోం శాఖమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఉమ్మడి విశాఖ జిల్లాల డిసిఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, రాష్ట కార్పొరేషన్ల ఛైర్మన్‌లు పీలా గోవింద సత్యనారాయణ, మల్ల సురేంద్ర బాబు ఆత్మీయ వీడ్కోలు పలికారు.



సభా ప్రాంగణంలో ఉన్న చెత్త చెదారం

కొరవడిన స్వచ్ఛత

అనకాపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరు కాగా, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో స్వచ్ఛత కొరవడింది. ప్రజా వేదికలో సుమారు 3000 మంది నాయకులు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు. అయితే ముఖ్యమంత్రి రావడం ఆలస్యం కావడంతో హాజరైన వారందరికీ స్నాక్స్ నిర్వాహకులు అందజేశారు. వీటిని తిన్న తరువాత కవర్లు, పండ్ల తొక్కలు, డ్రింక్ కాళీ బాటిల్స్ వేసేందుకు తొట్టెలు ఏర్పాటు చేయకపోవడంతో చిందరవందరగా వేదిక అంతా పడవేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తూ నేను నా పరిసరాల పరిశుభ్రత ఉంచుకుంటూ రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌గా ఉంచుతామని చేసిన ప్రతిజ్ఞకు, అక్కడ వాస్తవ పరిస్థితి పట్ల కొందరు బాహాటంగానే విమర్శించారు. వాస్తవానికి చెత్త వేసేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేస్తే బాగుండును అనే అభిప్రాయం వ్యక్తమైంది.



రోజా పువ్వు ఇచ్చి స్వాగతం పలుకుతున్న తాతయ్యబాబు

చంద్రబాబుకు తాతయ్యబాబు స్వాగతం

బుచ్చయ్యపేట : అనకాపల్లి జిల్లా పర్యటనకు శనివారం అనకాపల్లి నియోజకవర్గం కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఘనంగా స్వాగతం పలికారు.



స్వాగతం పలుకుతున్న స్పీకర్ అయ్యన్న, మంత్రులు అనిత, రవీంద్ర

సిఎం బహిరంగ సభకు తరలివెళ్లిన కూటమి శ్రేణులు

సబ్బవరం : అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో శనివారం జరిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు మండలంలోని కూటమి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పైడివాడ అగ్రహారం మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు ఆధ్వర్యంలోనూ, బిజెపి సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలోనూ, బంగారమ్మపాలెం సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు ఆధ్వర్యంలోనూ, జనసేన మహిళా నేత బంతి కోళ్ల పద్మ ఆధ్వర్యంలోనూ టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలు వెళ్లారు.

కార్యక్రమంలో అక్కిరెడ్డి దుర్గి నాయుడు, గొంతిన పైడిరాజు, కోన సత్యనారాయణ, అంతకాపల్లి ఎంపీటీసీ చొక్కాకుల గోవింద, రొంగలి బుచ్చంనాయుడు, రాజాన నాయుడు, టి.శేఖర్, కొల్లి కృష్ణ, జి.మన్మధరావు, ఎన్.కొండబాబు, మేడపాటి రాము, తమరాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

బుచ్చయ్యపేట : అనకాపల్లిలో జరిగిన మాజీ ప్రధాని వాజ్‌పాయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం బయలుదేరి వెళ్లారు. రాజం జంక్షన్లో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ ఆధ్వర్యంలో వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఎంవి వి సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి గోకవాడ కోటేశ్వరరావు, తమరాన దాసు, మరిచా సతీష్, కోట సత్యనారాయణ, దొడ్డి కిషోర్, వియ్యపు అప్పారావు, దేవర అప్పారావు పాల్గొన్నారు.



కార్యక్రమానికి బయలుదేరిన బుచ్చయ్యపేట మండల నేతలు



రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

గణిత పునాదులపైనే సాంకేతిక అభివృద్ధి

ప్రజాశక్తి- పాయకరావుపేట : మానవుని దైనందిన జీవితంలో గణితం ఒక భాగమని, ఆధునిక విజ్ఞానం, సాంకేతిక అభివృద్ధి అన్నీ గణిత పునాదులపైనే నిలబడి ఉన్నాయని ప్రముఖ గణిత శాస్త్ర ఆచార్యులు, అంతర్జాతీయ గణిత విద్య పరిశోధన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్ఆర్.సంతానం పేర్కొన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శనివారం ఇన్ఫినిటమ్ పేరిట నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో గణితం పరిధిని వివరించారు. విద్యార్థులు గణితాన్ని కేవలం ఒక విషయంగా కాకుండా జీవన నైపుణ్యంగా అభ్యసించాలని సూచించారు. గీతం డీమ్డ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అరుణ కుమారి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ 15 ఏళ్లకే భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత అని పేర్కొన్నారు. నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శివయ్య మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో పరిశోధన చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు క్రాస్‌వర్డ్, క్విజ్, పద శోధన వంటి పలు విజ్ఞానాత్మక పోటీలను నిర్వహించారు. క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ రామకృష్ణారెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెనుగొండ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో బహుమతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు బొడ్డేడ గోవిందరావుది లైట్ ఆఫ్ లర్నింగ్ అంశంలో ఉపాధ్యాయుల విభాగంలోనూ, విద్యార్థుల విభాగంలో లిక్విడ్ మాన్యూర్ మేనేజ్మెంట్‌లో విద్యార్థులు గంగుపాము దీపిక, సరగడం పవన్, కొణతాల హరీష్ ప్రథమ బహుమతులు సాధించారు. చోడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19న నిర్వహించిన జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో వీరికి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ రెండు అంశాలను రాష్ట్రస్థాయికి పంపనున్నట్టు డీఈవో తెలిపారు. వీరు ప్రథమ బహుమతులు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ శంకర్‌రావు, పాఠశాల కమిటీ ఛైర్మన్ పెతకంశెట్టి బలరామస్వామి, విద్యా కమిటీ సభ్యులు ఆడారి గోవిందరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సుస్థిర వ్యవసాయం కేటగిరిలో నమూనా పొంది రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. చోడవరం బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో అనకాపల్లి భార్గవి, ఈర్లె నవ్య నమూనాను తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ప్రథమ స్థానం లభించింది. ఈనెల 23, 24వ తేదీల్లో విజయవాడలో జరగునున్న రాష్ట్రస్థాయి ప్రదర్శనలో నమూనాను భార్గవి, నవ్య ప్రదర్శిస్తారు. ఈ నమూనా రూపలకల్పనకు ఉపాధ్యాయులు సూరెడ్డి బాబురావు మార్గదర్శకులుగా వ్యవహరించారు. ఈ ప్రదర్శనకు డిప్యూటీ డిఇఒ అప్పారావు చేతులమీదుగా బహుమతి అందుకున్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికవడం పట్ల సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, ఎంఈఓలు కూనిరెడ్డి సత్యనారాయణ, డివిడి ప్రసాద్, హెచ్‌ఎం ఆళ్ల శేఖర్, ఎస్ఎంసి ఛైర్మన్ కిల్లి సింహాచలం నాయుడు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి జన్మదినం వేడుకలు స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రమాకుమారి సోదరుడు ఆడారి సంతోష్ హాజరై కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొద్దపు శివ, మల్ల కొండబాబు, నక్క శివ శంకర్, సుందరపు బాబ్జి సియ్యాద్రి శ్రీను, బొడ్డేటి సురేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలు వితరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి గణేష్ కాలనీలో వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి గ్రామానికి చెందిన కంచర్ల సోమన్న శెట్టి (రేషన్ డీలర్) రూ.40 వేలు విలువ గల ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫార్మా వ్యర్థాలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈదలపాక బోనంగి రెవెన్యూలో కొండ పక్కన పెద్ద గొయ్యి తవ్వి ఫార్మా వ్యర్థ రసాయలను దొంగ చాటుగా లారీలతో తీసుకొచ్చి ఈ ప్రాంతంలో వేసి మండిస్తున్నారని, దీనివల్ల దట్టమైన పొగ, గాఢమైన వాయు కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. ఫార్మా వ్యర్థాలను ఆరుబయట ఇలా మండిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫార్మా వ్యర్థాలు మండుతున్న ప్రాంతాన్ని శనివారం గనిశెట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా వ్యర్థ రసాయనిక పదార్థాలను ఆరుబయట నిబంధనలకు విరుద్ధంగా వేసి మండిస్తున్నారని దీనిపై వెంటనే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రమాదకరమైన రసాయలను మండించడం వలన ఈ ప్రాంతంలో గాఢమైన వాయువులు విడుదల అవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. వాయు కాలుష్యం వలన బొద్దపువానిపాలెం, గౌతు లచ్చన్న కాలనీ, ఇండస్ట్రియల్ పార్క్ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీటి నియంత్రణకు వెంటనే చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, ప్రమాదకరమైన వ్యర్థాలను డ్రంప్ చేస్తున్న లారీలను సీజ్ చేయాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి మహాలక్ష్మి నాయుడు, బి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మా వ్యర్థాలను మండిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గనిశెట్టి



సమావేశంలో పాల్గొన్న గాండ్ల తెలికుల సంఘం నాయకులు

గాండ్ల తెలికులను మభ్యపెట్టడం సరికాదు

ప్రజాశక్తి-కె.కోటపాడు : నాలుగుగోడల మధ్య తూతూ మంత్రంగా సిటీ కమిటీని వేసి జిల్లా కమిటీగా ప్రచారం చేసుకోవడం గాండ్ల తెలికుల కులస్తులను మభ్యపెట్టడమే అవుతుందని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పెబ్బిలి రవికుమార్ అన్నారు. మండలంలోని ఎ.కోడూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణానికే పరిమితమైన సంఘాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. సంఘం ప్రయోజనాలు నెరవేరాలన్నా సంఘం పటిష్టంగా నిర్మాణం జరగాలన్నా సంఘం కమిటీని ప్రజాస్వామ్య బద్ధంగా, బహిరంగంగానే ఎన్నుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. జనవరి 4న అనకాపల్లిలో బహిరంగ సమావేశం నిర్వహించి అనకాపల్లి జిల్లా కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభ నిర్వహణకు అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగస్తులు, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ తదితర పెద్దల సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా తాత్కాలిక అధ్యక్షులు కోటిపల్లి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు కోటిపల్లి వెంకటకొండయ్య, ఎన్నేటి శ్రీనివాసరావు, పేరూరు అప్పారావు, కొమ్మనాపల్లి స్వామినాయుడు, చిత్రాడ సత్తిబాబు, కోటిపల్లి మాణిక్యం, పేరూరి వెంకటరమణ, బత్తిన సత్యానారాయణ మూర్తి, కోటిపల్లి వీరబాబు, కోటిపల్లి గోపి, పాలిశెట్టి శ్రీనివాసరావు, కొమ్మనాపల్లి మణికంఠ, చిత్రాడ చంటిబాబు, పేరూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ఎగ్జిబిషన్ పోటీల్లో దివ్యకు తృతీయ స్థానం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బేతపూడి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న కె.దివ్య అనకాపల్లిలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి కెరీర్ ఎగ్జిబిషన్ పోటీల్లో తృతీయ స్థానం సాధించింది. చదువుతోపాటు వృత్తివిద్య అంశాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ పోటీల్లో యోగ, బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సుల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై ఆమె చేసిన ప్రసంగం, మోడల్ ప్రజెంటేషన్ న్యాయ నిర్ణేతలను ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనకు గుర్తింపుగా జిల్లా స్థాయిలో ఆమెకు మూడో స్థానం లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఓ సిహెచ్ భువనమాదిరి, వోకేషనల్ ఉపాధ్యాయులు లకే సునీత, సుశీల అభినందనలు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా యలమంచిలి మండలం, రేగుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి ప్రొడక్షన్ అధికారి హాజరై బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలు వివరించి, పిల్లలుచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, పాఠశాల హెచ్ఎం మదన్ మోహన్‌రావు, యలమంచిలి ఎంఎల్ఎస్‌ఎ లాయర్ నూకరాజు, సచివాలయం సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం శనివారం జరిగింది. ఎలమంచిలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కే ఇందిరాదేవి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ రమణకుమారి, సూపర్వైజర్ ఎస్‌కేఎన్.మీరాభి, హెచ్ఎం బిఏ.రామయ్య, టీచర్లు వెంకటరాజు, వెంకటరమణ, గౌరీ, శేష కుమారి, అంగన్వాడీ టీచర్లు నూకాలమ్మ బాల భవాని పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : బాలికల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని మూడో అదనపు సివిల్ జడ్జ్ నికిత సెంగర్ పేర్కొన్నారు. పాఠశాలలో , పని ప్రదేశాలు తదితర చోట్ల వారి రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గవరపాలెం విద్యాధర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో బాల్యవివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాల రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ మేరీ, ఎల్‌సి పిఓ రమాదేవి, కౌన్సిలర్ సంతోషీ తదితరులు పాల్గొన్నారు.

80 మంది విద్యార్థులు.. ఒకటే తరగతి గది

- నాడు-నేడు కింద చేపట్టిన భవనం మధ్యలో నిలిచిపోయిన వైనం
- తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఒకటే తరగతి గది ఉన్న దృశ్య, నిర్మాణం నిలిచిపోయిన భవనం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలం రేగుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1 నుండి 10వ తరగతి వరకు 80 వరకు విద్యార్థులు ఉండగా, బోధనకు 10 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. కాని విద్యార్థులు కూర్చొడానికి తరగతి గదులే లేవు. పాఠశాల మొత్తానికి ఒకే ఒక్క తరగతి గదిలో ఉండడంతో వర్షం వస్తే అందరు అదే గదిలో తరగతులు నడపాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిజానికి ఆ గది పరిస్థితి చూస్తే పదిమంది ఉపాధ్యాయులు, కుర్చీలు వేసుకుంటే సరిపోనంత గది. ఈ పాఠశాలలో ఆ ఒక్క గదిలో అందరు విద్యార్థులకు ఏ విధంగా బోధన చేస్తున్నారో ఆలోచిస్తేనే భయమేస్తుంది. కొద్దిమంది విద్యార్థులకు పక్కన ఉన్న ఎంపీపీ పాఠశాల గదుల్లో నడుపుతున్నారు. మిగిలిన అందరు, ఉపాధ్యాయులకు ఈ గదే దిక్కు.

గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడు పథకం కింద భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. బిల్డింగ్ సగం పూర్తయి, మరొక సగం పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ అన్ని వస్తువులను ఇటుక, ఇనుము, కంకర డంపు చేశారు. కానీ ఇంతలో ప్రభుత్వం మారడం వల్ల ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. ఆ సామాగ్రి పాడవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అదనపు గదుల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న వినోద్‌బాబు

శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

ప్రజాశక్తి -చోడవరం : ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మద్దిల వినోద్‌బాబు ఆదేశించారు. స్థానిక జూనియర్ కాలేజీను శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముస్తాబు కార్యక్రమంను తప్పకుండా అమలు చెయ్యాలన్నారు. ఫిబ్రవరిలో జరగబోయే ఫైనల్ పరీక్షలో 100 ఉత్తీర్ణత శాతం సాధించేందుకు లెక్చరర్లు అందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసరావు, ఇతర లెక్చరర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వీధులను శుభ్రపరిచారు. తడి, పొడి చెత్తను వేరుచేసి హరిత రాయబారులకు అందజేయాలని సూచించారు. ఇంటి పరిసరాలు, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని గ్రామస్తుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రైవాడ జలాశయ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, పిఎసిఎస్ అధ్యక్షుడు గొర్లె గోవింద, సచివాలయ సిబ్బంది అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.భుజంగరావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మనందరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు, విఆర్ఎలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జివిఎంసి, మలేరియా, డెంగీ, ప్లాస్టిక్ నివారణ కోసం కళాజాత ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజల చేత వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తురకపూడి బాలస్వామి, కళ్యాణ్, వడిసెల శ్రీను, నాగేశ్వరరావు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

3 టన్నుల పైబడి వరి ధాన్యం అపహరణ

సంచరిస్తున్న దొంగల ముఠా

ప్రజాశక్తి-దేవరాపల్లి : దొంగచాటున ధాన్యాన్ని దోచుకుపోయే గుర్తు తెలియని దొంగల ముఠా సంచరిస్తోంది. మండలంలో ఎం.అలమండ, ఎన్.గజపతినగరం గ్రామాల్లో రైతులు కళ్లాల్లో నూర్చి, విక్రయినికి సిద్ధంగా ఉంచిన సుమారు 3 టన్నులకు పైబడిన ధాన్యం బస్తాలను శుక్రవారం రాత్రి ఈ దొంగల ముఠా దోచుకుపోయింది. ఈ ధాన్యం విలువ సుమారు రూ.2 లక్షలకు పైబడి ఉంటుందని బాధిత రైతులు చెబుతున్నారు. పోలీసులకు బాధిత రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దొంగల ఆచూకీ కోసం వెతుకులాట ప్రారంభించారు. దీనికి సంబంధించి బాధిత రైతులు చెప్పిన ప్రకారం వివరాలు ప్రకారం.. ఎం.అలమండకు చెందిన పీల బలరాం, పొలిపిరెడ్డి రమణ, ఎల్లపు ముత్యాలు, ఎన్.గజపతినగరంకు చెందిన రొంగలి వెంకటరావు, బర్ల రాము, చిరికి నాయుడుబాబు తదితర రైతులు తాము నూర్చిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రానికి విక్రయించాలనే ఉద్దేశంతో మేడిచర్ల, వేచలం రోడ్డు పక్కనున్న కళ్లాల్లో ఆరుబయట బస్తాలు వేసి ఉంచారు. వాటికి శుక్రవారం రాత్రి ఒంటిగంట వరకు కాపలా ఉండి ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం కళ్లాలకు వచ్చి చూసేసరికి ధాన్యం బస్తాలు కనిపించలేదు. దీంతో బాధిత రైతులు లబోదిబోమన్నారు. నెలల తరబడి కష్టపడి పండించిన ధాన్యాన్ని మరి కొద్ది గంటల్లో అమ్మేద్దామనుకున్న సమయంలో దొంగలు పట్టుకుపోయారని, తమకు చేతికందాల్సిన వేలాది రూపాయలు నష్టపోయామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏనాడూ ఇలాంటి దొంగతనాలు జరగలేదన్నారు. ఇటువంటి దొంగల్ని పోలీసులు పట్టుకుని కరణంగా శిక్షించి, చోరీకి గురైన ధాన్యాన్ని తమకు అప్పగించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-సబ్బవరం : వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి జిల్లా వినియోగదారుల సంఘం కార్యదర్శి రాపేటి శివ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఆరిపాక జెడ్పి హైస్కూల్, సబ్బవరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలలో విద్యార్థులకు శనివారం వినియోగదారుల తమ హక్కులు బాధ్యతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాపేటి శివ సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన తక్కువగా ఉంటుందని, అక్కడి ప్రజలకు చైతన్యం చేయాలని సూచించారు. నేటి డిజిటల్ ప్రపంచంలో వినియోగదారులు ప్రకటనల ద్వారా చాలా మోసపోతున్నారన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన ఉంటే వస్తు సేవలు కొనుగోలులో మోసాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కేశవరావు, ఆరిపాక జడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు పివి.రామలక్ష్మి, ఆర్. శారద ప్రసాద్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పోలియో చుక్కలు వేయించాలి

ప్రజాశక్తి-పరవాడ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహనా ర్యాలీ శనివారం నిర్వహించారు. పోలియో నిర్మూలనపై ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ ఆదివారం మండలంలో 3,303 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్-ఎస్.సాయిరాం, పిహెచ్ఎన్. జానకిరామన్, సూపర్వైజర్లు ఎంఎస్.ప్రసాద్, పివి.రత్నం, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డాక్టర్ కేఎం నాయుడు డాక్టర్ రామ చైతన్య అన్నారు. ఆస్పత్రిలో శనివారం పల్స్ పోలియో పోస్టల్‌ను విడుదల చేశారు. 4,444 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాటు చేశామన్నారు.

సబ్బవరం : పోలియో చుక్కలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి ఎస్ఎన్ఆర్ చక్రవర్తి కోరారు. మండలంలోని 8,666 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దమయంతి పాల్గొన్నారు.

గొలుగొండ: ఈ నెల 21న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్, కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారులు జ్యోతి, గాయత్రి తెలిపారు. 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్న పిల్లలకు పోలియో నివారణ చుక్కలు వేయాలన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ సమీపంలో గల పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

బుచ్చయ్యపేట : ఆదివారం జరుగు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తురకలపూడి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి కోరారు. శనివారం పల్స్ పోలియో పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.



బుచ్చయ్యపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

సీతమ్మధార : పిఎం.పాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,09,652 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 1062 పోలియో బూత్‌లు, 50 ట్రాన్సిట్ బూత్‌లు, 94 మొబైల్ బృందాలు, ఇంటింటి సందర్శన కోసం 2124 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.లూసీ కార్డీలియా, మహిళల ఆరోగ్య అధికారి డాక్టర్ ఎన్‌వి.సమత, డిపిఒ శశిభూషణరావు, వైద్యాధికారులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సుసన్నా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'ముస్తాబు' ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు నక్కపల్లి గురుకులంలో ప్రిన్సిపల్ ఉషారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్తాబు కార్యక్రమాన్ని శనివారం ఎంఈఓలు నరేష్, నాగన్నదొరలు చేతుల మీదుగా ప్రారంభించారు. అద్దం, దువ్వెన, సబ్బు వంటి మేకప్ కిట్ ను ముస్తాబు కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉంచారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవన అలవాట్లు, శుభ్రత విలువ, స్వీయ సంరక్షణకు ప్రాధాన్యత కల్పించడంలో భాగంగా ముస్తాబు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఆరోగ్యం, పరిశుభ్రతకు సంబంధించిన అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఇఒలు

ఇళ్ల స్థలాలకు 163 దరఖాస్తులు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో ఇళ్ల స్థలాల మంజూరుకు 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 163 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ నాగమ్మ తెలిపారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం నెల రోజుల క్రితం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిందన్నారు.

మాధవికి అవార్డు ప్రదానం

ప్రజాశక్తి- మాడుగుల: అంతర్జాతీయ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాదులో జరుగుతున్న అంతర్జాతీయ సమ్మేళనంలో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన వాసవి ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పుట్ట మాధవికి ఉత్తమ జోన్ చైర్మన్ అవార్డు ప్రదానం చేశారు. ఏడాది కాలంలో జోన్ పరిధిలో చేసిన కార్యక్రమాలను ప్రశంసిస్తూ అంతర్జాతీయ అధ్యక్షులు ఏరుకుల రామకృష్ణ చేతుల మీదుగా శుక్రవారం రాత్రి అవార్డు అందుకున్నట్టు తెలిపారు. ఇందుకు సహకరించిన జోన్ పరిధిలోని క్లబ్బుల సభ్యులకు, అంతర్జాతీయ అధ్యక్షులు రామకృష్ణకు, జిల్లా గవర్నర్ పూర్ణిమా, అంతర్జాతీయ ఉపాధ్యక్షులు ఎస్ శ్రీనుకు ధన్యవాదాలు తెలిపారు.



అవార్డును ఇస్తున్న ప్రతినిధులు



పిల్లలతో స్నేహితులు

స్నేహితుల దాతృత్వం

ప్రజాశక్తి -మాడుగుల: ఇటీవల మాడుగుల రాజు వీధికి చెందిన గిరి అనారోగ్యంతో మరణించడంతో కుటుంబ సభ్యులకు స్నేహితులు ఆర్థికంగా సహాయం చేసి దాతృత్వాన్ని చాటుకునాన్నారు. గిరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో గిరితో చదివిన 2000-01 పదవ తరగతి స్నేహితులు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు నిర్ణయించుకున్నారు. ఆ పిల్లల పేరున పోస్టు ఆఫీసులో సుమారుగా రూ 1.21 లక్షలు డిపాజిట్ చేసి దాతృత్వం చాటుకున్నారు. పిల్లల విద్యకు సంబంధించి ఖర్చులు ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం అవసరాలకు రూ 5వేలు నగదు అందజేశారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి: టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ లు కే.నరేష్, ఆర్.నాగన్న దొర సూచించారు. సమగ్రశిక్షా విద్యాశాఖ సంయుక్త ఆదేశాల మేరకు శనివారం నక్కపల్లిలో జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్.ఎమ్ పి.విజయ, చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో హెచ్ఎమ్ బాలాజీ ఆధ్వర్యంలో స్కూల్ అసిస్టెంట్ కాంప్లెక్స్ తరగతులను నిర్వహించారు. శిక్షణా తరగతులను ఎంఈఓలు సందర్శించారు. పదవ తరగతి వందరోజుల యాక్షన్ ప్లాన్, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, ప్రగతి గురించి చర్చించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన సాధనకు ఎలాంటి కృత్యాలు అమలు చేయాలో చర్చించాలన్నారు. వందశాతం ఫలితాలు సాధించాలని ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా ఉత్తీర్ణులయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతీరోజూ స్లిప్ టెస్ట్ నిర్వహించి విశ్లేషణ చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ నాగన్న దొర

వైద్య శిబిరాలకు విశేష స్పందన

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: స్థానిక సిటీ క్లబ్లో జన విజ్ఞాన వేదిక, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కే త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ, ఈ వైద్యశిబిరంలో సుమారు 180మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు. మెడి కవర్ ఆస్పటల్ వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హర్షిత్, భాగ్యరాజ్, కిరణ్ కుమార్, మెడికల్ క్యాంప్ ఇంచార్జ్ పుష్పగిరి రాజు పాల్గొన్నారు.

నర్సీపట్నంరూరల్: మాకవరపాలెం కేజీబీవీ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు కామేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. చిరు ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత శుభ్రతకు అత్యంత ప్రాధాన్య ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హరిషిత్, రాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు



నర్సీపట్నంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేస్తున్న దాతలు

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో రమణయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు బహూకరించారు. రమణయ్యపేట గ్రామానికి చెందిన కర్రి సత్తిబాబు, ముకుందరాజు పేట గ్రామానికి చెందిన కిల్లాడ మరినియ్య కలిసి 10 వేల రూపాయలతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ లను సమకూర్చారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి చిన్నతల్లి, పాఠశాల చైర్మన్ సిహెచ్ లక్ష్మి, ఉపాధ్యాయుల చేతుల మీదుగా శనివారం విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పిడి చిరంజీవి, ఉపాధ్యాయులు లతాకుమారి, నానాజీ, ఏవివి క్రాంతి, అచ్చిబాబు, శంకర్రావు, చిరంజీవి, సునీత, శివరాం, కాశమ్మ పాల్గొన్నారు.



వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు

వెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ధనుర్మాసోత్సవాల్లో వైభవంగా భాగంగా శనివారం ఇత్తడి శేష తల్పం వాహనంపై శ్రీనివాసుడు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.వెంకన్న ఉత్సవమూర్తులను శేషతల్పం వాహనం, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలోను అధిష్టింప చేసి మాడవీధుల్లో అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు సంఘర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నండూరిరాజ గోపాలాచార్యులు, పవన్, ఆలయ ఇన్ స్పెక్టర్ కూర్మేశ్వరరావు పాల్గొన్నారు.



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి- నక్కపల్లి: ఈనెల 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం పురస్కరించుకొని నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం సాయంత్రం ధ్యానంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శివయ్య ఆధ్వర్యంలో వేంపాడు ఆయుష్ యోగా ఇన్ స్ట్రక్టర్ డిరాంబాబు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎలమంచిలి యోగా గురువు ఎ.గంగాధర్ డిగ్రీ విద్యార్థులకు ప్రాణాయామం, భస్త్రిక, కపాల భాతి, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివయ్య మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే యోగా నేర్చుకోవడంతో భవిష్యత్తులో అనారోగ్యాలు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు రాంబాబు, గంగాధర్, వేంపాడు ఆయుష్ డాక్టర్ కె. రఘు, ఫార్మసిస్ట్ రామకృష్ణ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న పట్టాభిరామ్

తడి, పొడి చెత్తను సేకరించాలి

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

ప్రజాశక్తి- నక్కపల్లి: స్వఛ్చాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమిరెడ్డి పట్టాభిరామ్ అన్నారు. నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను శనివారం ఆయన సందర్శించారు. యాక్షన్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు. అనంతరం పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం అమలుపై సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రతపై చర్చించారు. ప్రతి ఇంట తడి పొడి చెత్త సేకరణ పక్కాగా అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సేకరణ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ట్రాక్టర్లు, ట్రై సైకిల్స్ త్వరలో అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి చైతన్య, పలువురు ఎంపీడీవోలు, ఏవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో గిరిజా జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దుప్పట్లు ఇస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి-రావికమతం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడివాడ జడ్పీ హైస్కూల్‌లో శనివారం రావికమతం గ్రామానికి చెందిన బండారు రాజారావు, కామేశ్వరి దంపతులు మండలంలో 30 మంది దివ్యాంగ విద్యార్థులకు దుప్పట్లను వితరణగా అందించారు. మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు, స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, తెలుగు ఉపాధ్యాయులు, యుటిఎఫ్ రావికమతం మండల అధ్యక్షులు గంజి నాగేశ్వరరావులు చేతుల మీదుగా దివ్యాంగ విద్యార్థులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, రావికమతం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బండారు రాజారావు గత మూడు సంవత్సరాలుగా దివ్యాంగ విద్యార్థులకు పలు రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ భారత ప్రభుత్వ టెక్స్ టైల్స్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని ఐఐటి, ఐఐఎంల వంటి ప్రతిష్టాత్మక స్థాయి సంస్థ అన్నారు. తమ సంస్థకు దేశ వ్యాప్తంగా 19 నెట్‌వర్క్ కేంద్రాలు ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ స్థాయి ప్రోగ్రాముల్లో వివిధ కోర్సులను అందిస్తున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని జనవరి 6 వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. రాతపరీక్ష ఫిబ్రవరి 8న ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ బిటి దొర పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడలు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు వరలక్ష్మి, పద్మ, జ్యోతి, గంగాధర్, రాము తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా గాజువాక మెయిన్ రోడ్డులో ప్రచారం నిర్వహించారు. ప్రతి షాపునకూ వెళ్లి సభ విజయవంతానికి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, ఎల్.బంగారునాయుడు, ఎ.లోకేష్, గొలగాని అప్పారావు, పి.నర్సింగరావు, ఐద్వా నాయకులు జి.లక్ష్మి, కె.సంతోషం, ఎం.శ్రీదేవి, దాసర అప్పారావు, అప్పలరాజు పాల్గొన్నారు.



గాజువాకలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు



ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

పెందుర్తి : చినముసిడివాడ, పెందుర్తి, సింహాచలం, కూడళ్ల వద్ద కార్మిక పోరాటలను, ఉద్యమ ప్రస్తానాన్ని తెలియజేసేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ, సుమారు 40 నుండి 50 ప్రేమలతో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. స్వతంత్ర పోరాటం నుంచి నేటి వరకు జరిగిన అనేక ఉద్యమాల వివరాలను పొందుపరిచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శంకరరావు, ప్రభుదేవా, అప్పలనాయుడు, ఈశ్వరరావు, మహిళా సంఘం నాయకులు బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోకు ఆదరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని గాదిరాజు ప్యాలెస్‌లో తలపెట్టిన 11వ క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో రెండో రోజైన శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో హాజరై నివాస, వాణిజ్య ప్రాజెక్టులను పరిశీలించారు. ఒకే వేదికపై విభిన్న ప్రాజెక్టులను పోల్చుకోవడంతో పాటు డెవలపర్లు, బ్యాంకర్లు, రియల్ ఎస్టేట్ నిపుణులతో నేరుగా చర్చించారు. ఎక్స్‌పోకు తుది వినియోగదారులు, పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎపిఇపిడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీ తేజ్ ఇమ్మడి విద్యుత్ ఖర్చులను తగ్గించి గృహ ఇంధన భద్రతను పెంచే పరిష్కారం రూఫ్‌టాప్ సోలార్ అని తెలిపారు. పిఎం సూర్య ఘర్, ముఫ్ట్ బిజిలి యోజన ద్వారా ఒకసారి పెట్టుబడి పెడితే సుమారు 20 సంవత్సరాల పాటు విద్యుత్ అవసరాలు తీర్చుకోవచ్చని, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపి ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఈ పథకం కింద ప్రత్యక్ష సబ్సిడీలు, నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, డైరెక్ట్ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో జరిగిన ప్యానెల్ చర్చలో గృహ రుణాలు, అర్హతలు, తిరిగి చెల్లింపు విధానం, నిర్మాణ నాణ్యతపై చర్చించారు.



ఎపిఇపిడిసిఎల్ సిఎండిని సత్కరిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

'ఉపాధి హామీ'కి తూట్లపై నిరసనలు



రాంబిల్లిలో గాంధీ చిత్ర పటాలతో నిరసన తెలుపుతున్న కూలీలు

ప్రజాశక్తి-రాంబిల్లి : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ చేపట్టిన చట్ట సవరణను వ్యతరేకిస్తూ రాంబిల్లిలోని రాంబిల్లి, మూలజంప గ్రామాలలో సిఐటియు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు శనివారం పని ప్రదేశాల్లో నిరసన తెలియజేశారు. రాంబిల్లిలో గాంధీజీ చిత్ర పటాన్ని ప్రదర్శించి ఎంజిఎన్ఆర్ఇజిఎను యథాతథంగా కొనసాగించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ గాడ్సే వారుసులైన కేంద్ర బిజెపి పాలకులు అధికారం చేపట్టిన నాటి నుండి ఎంజిఎన్ఆర్ఇజిఎను నిర్వీర్యం చేయడానికి అనేక కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఆ క్రమంలోనే జాతిపిత మహాత్మా గాంధీ పేరు మార్చి, విబి-జీఆర్ఎఎం జీ నామకరణం చేశారని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధులకు సైతం తగ్గించడమే కాకుండా, చట్టాన్ని పథకంగా మార్చి, దానికి 90 శాతానికి బదులు 60 శాతం నిధులు మాత్రమే ఇవ్వడానికి సవరణలు చేసిందని తెలిపారు. భవిష్యత్తులో అంచలంచలుగా ఈ వదులుకునే ఆలోచన తప్ప మరొకటి కాదన్నారు. ఈ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు ఎంతో మేలు జరిగిందని, వలసలు తగ్గాయని గుర్తు చేశారు. ఉపాధిని తగ్గించి, గతంలో కేటాయించిన నిధులను తగ్గించి, శ్రీరాముడి పేరు పెట్టడం అంటే మోసం చేయడం కాక మరేమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఎంజిఎన్ఆర్ఇజిఎను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చందక రామకృష్ణ, ఎన్ నారాయణరావు, ధోని కాసియా, ఉరుకోటి అప్పారావు, ఉపాధి శ్రామికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించి చట్ట సవరణ చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు ఆరోపించారు. మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో శనివారం విబి-జీఆర్ఎఎం జీ సవరణ బిల్లు కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో నాటి యూపీఏ-1 ప్రభుత్వము వామపక్షాల ఒత్తిడితో గ్రామీణ పేదలకు వంద రోజులు పని కల్పించడానికి తీసుకొచ్చిన ఈ చట్టాన్ని బిజెపి పాలకులు నిర్వీర్యం చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. కూలీలందరూ ఐక్యంగా బిజెపి కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఈర్లే నాయుడు బాబు, రైతు సంఘం నాయకులు వనం సూర్యనారాయణ, శ్రీరాములు, కూలీలు పాల్గొన్నారు.



సూరెడ్డిపాలెంలో సవరణ బిల్లు కాపీలు దహనం చేసిన రైతులు

డిగ్రీ కాలేజీలో మెడిటేషన్ క్లాసులు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : ప్రపంచ ధ్యాన్య దినోత్సవాన్ని పురస్కరించుకొని యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడిటేషన్ క్లాసులో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ఆడారి గంగాధర్ మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ మొత్తం 182 దేశాల్లో అందరు ఆరోగ్యం కోసం ఆనందం కోసం మెడిటేషన్ క్లాసులో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందరూ ఆరోగ్యంగా ఆనందంగా జీవించడమే జీవన కళ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.చంద్రశేఖర్, అధ్యాపకులు ఆడారి అర్జున అప్పారావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మెడిటేషన్ శిక్షణ ఇస్తున్న దృశ్యం